www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 13 మార్చి 2023

5

ఏలూరు



మార్క్స్ వర్ధంతి సందర్భంగా 14న చర్చా గోష్టి

ఏలూరు: ప్రపంచ మేధావి, తత్వవేత్త కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా 14వ తేదీన చర్చా గోష్టి నిర్వహిస్తున్నట్లు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, హేలాపురి చైతన్య వేదిక కన్వీనర్ కె.రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారొక ప్రకటన విడుదల చేశారు. నేటి సామాజిక అశాంతులు, ఆవేదనల నేపథ్యంలో కారల్ మార్క్స్ జీవితం, ఆయన చూపిన పరిష్కారాలు, మార్గాల గురించిన చర్చ ప్రపంచం అంతా జరుగుతోందని తెలిపారు. మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకుని 'మార్క్స్ జీవితం, మార్క్సిజం, ప్రాధాన్యత, విశిష్టత' అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని సిఐటియు జిల్లా ఆఫీస్‌లో 14వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు వీడియో క్లిప్పింగ్ ప్రదర్శనతో ప్రారంభం అవుతుందన్నారు. ఏలూరు పరిసర ప్రాంతాల ప్రజాసంఘాలు, వివిధ పార్టీలు, స్వచ్ఛంద సేవాసంస్థల వారు పాల్గొనాలని కోరారు.

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో ..

ఓటుకు రూ.20 వేలు..!

అధికార పార్టీ ఓటర్లకు డబ్బు పంపిణీ

కొవ్వూరు నియోజకవర్గంలో గిఫ్టులు

గెలుపుపై వైసిపిలో నెలకొన్న భయమే కారణమా..?

నేడు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్


కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఐదు కేంద్రాల్లో పోలింగ్

విధుల్లో 437 మంది పోలీసులు


ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్

ఓటు వేయనున్న1,105 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో సోమవారం జరుగుతున్న రెండు స్థానాల స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేపట్టినట్లు తెలిసింది. అధికార పార్టీలో ఈ డబ్బు పంపిణీ కొనసాగింది. అధికారపార్టీకి చెందిన ఓటర్లకు రూ.20 వేలు చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం. ఎంఎల్‌ఎల పర్యవేక్షణలో డబ్బు పంపిణీ సాగినట్లు బహిరంగంగా ప్రచారం సాగుతోంది. అసంతృప్తిలో ఉన్న అధికార పార్టీకి చెందిన ఓటర్లు ప్రతిపక్షాలు బలపరిచిన అభ్యర్థికి ఓటువేసే అవకాశం ఉందన్న భయంతోనే అధికార పార్టీ డబ్బులు పంపిణీ చేసినట్లు సమాచారం. జిల్లాలో ఉన్న 1,105 మంది స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఓటర్లలో అధికార పార్టీకి 870 మంది స్థానిక ప్రజాప్రతినిధి ఓటర్లు ఉన్నారు. రెండుస్థానాలు ఏకగ్రీవంగా వైసిపికి దక్కే పరిస్థితి ఉంది. వైసిపి నుంచి పోటీలోకి దిగిన వంకా రవీంద్ర, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు ఏ ఇబ్బంది ఉండదని తొలి నుంచి అంతా భావించారు. అనూహ్యంగా టిడిపి మద్దతుతో వీరవల్లి చంద్రశేఖర్, గోరింక దాసు, పసల వెంకటాచలం, దేవరపల్లి ఆదాం స్వతంత్ర అభ్యర్థులుగా రంగలోకి దిగారు. దీంతో పోటీ అనివార్యమైంది. ప్రధాన అభ్యర్థిగా వీరవల్లి చంద్రశేఖర్‌ను టిడిపి, జనసేనలు మద్దతు పలికాయి. దీంతో వైసిపి ఓట్లు చీలే అవకాశం ఉందని అంతా అంచనాలు వేస్తున్నారు. దీంతో వైసిపి నేతల్లో గుబులు మొదలైంది. స్థానిక ప్రజాప్రతినిధులకు మాక్ పోలింగ్ నిర్వహించి ఓటు ఎలా వేయాలన్నదానిపై అవగాహన సైతం వైసిపి కల్పించింది. తమకు ఓటు వేసినందుకు డబ్బులు ఇవ్వాలంటూ వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేసినట్లు శనివారం తెలిసింది. కనీసంగా ఓటుకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో డబ్బుల పంపిణీ చేయపోతే గెలుపోటములు తారుమారయ్యే అవకాశం ఉందనే భయం వైసిపి నేతల్లో నెలకొంది. దీంతో వైసిపి ప్రధాన నాయకులు రంగంలోకి దిగి వైసిపి ఓటర్లకు ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆదివారం సాయంత్రం నియోజకవర్గాలకు డబ్బులు చేరడం, ఎంఎల్‌ఎ పర్యవేక్షణలో పంపిణీ జరిగినట్లు తెలిసింది. కొవ్వూరు నియోజకవర్గంలో డబ్బులకు బదులు అంతే ఖరీదు చేసే గిఫ్ట్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు అని తేడా లేకుండా అందరికీ రూ.20వేలు చొప్పున ఇచ్చినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఓట్లు చీలే అవకాశం ఉందని ప్రతిపక్ష పార్టీలు అంచనా వేస్తున్నాయి.



నేడు పోలింగ్

స్థానిక ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన అన్నిఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. సోమవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఐదు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. మొత్తం రెండు ఎంఎల్‌సి స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురం, కొవ్వూరు డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి బ్యాలెట్ బాక్సులను, బ్యాలెట్ పత్రాలను ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఆదివారం అందజేశారు. ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జరగనుంది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 1,105 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఏలూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 249 మంది, జంగారెడ్డిగూడెంలో 184 మంది, కొవ్వూరులో 242 మంది, నరసాపురంలో 229 మంది, భీమవరంలో 201 మంది స్థానిక ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు అనుమతించబడవని అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఎదో ఒకటి ఓటర్లు తీసుకురావాల్సి ఉంది. గుర్తింపు కార్డు చూపించిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతిస్తారన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రతీపోలింగ్ స్టేషన్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఇతర పోలింగ్ సిబ్బంది, ఒక మైక్రో ఆబ్జర్వర్, ఒక వెబ్ కాస్టర్ ఉంటారు. వారితోపాటు పోలింగ్ ఏజెంట్లు ఉంటారు. ఆయా పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకునే వారి వివరాలను ప్రతీపోలింగ్ కేంద్రంలో ప్రదర్శిస్తారు. ఓటు వేసేవారిని ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఎంపిడిఒలు, మునిసిపల్ కమిషనర్లు ధృవీకరించి పోలింగ్ కేంద్రంలోకి పంపుతారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. వీరికి ప్రత్యేక ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఏలూరు డిఆర్‌ఒ ఎవిఎన్‌ఎస్.మూర్తి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం ఆర్‌డిఒలు కె.పెంచల కిషోర్, డాక్టర్ ఝాన్సీరాణి, డి.రాజు, డిఎస్‌పిలు పైడేశ్వరరావు, కృష్ణంరాజు, ఏలూరు తహశీల్దారు బి.సోమశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

ఓటర్లు : మొత్తం 1,105 మంది. వీరిలో 856 మంది ఎంపిటిసిలు, 48 మంది జెడ్‌పిటిసి సభ్యులు, 180 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు 21 మంది ఉన్నారు.

పోలీస్ బందోబస్తు : సుమారు 437 మంది డిఎస్‌పి స్థాయి నుంచి వివిధ స్థాయిల వరకూ ఎన్నికల బందోబస్తు పర్యవేక్షణ.

పోలింగ్ సిబ్బంది : ఆరుగురు ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 12 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, ఆరుగురు ఇతర పోలింగ్ సిబ్బంది, ఏడుగురు మైక్రో అబ్జర్వర్లు, ఐదుగురు జోనల్ అధికారులు.

పోలింగ్ కేంద్రాలు

ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, నరసాపురం, భీమవరం ఎంపిడిఒ కార్యాలయాల్లో మొత్తం ఐదు పోలింగ్ కేంద్రాలు.

పగడ్బందీగా ఇంటర్ పరీక్షలు

కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు - 15 నుంచి ప్రారంభం - ఆర్ఐఒ కె.చంద్రశేఖర్‌బాబు




ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. వీటి నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 106 కేంద్రాల్లో జంబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈసారి పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తామని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని ఉమ్మడి జిల్లా ఆర్ఐఒ కె.చంద్రశేఖరబాబు ప్రజాశక్తి ముఖాముఖిలో తెలిపారు. ఆయన చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రశ్న : ఇంటర్ పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఉమ్మడి జిల్లాలో 72,048 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సర విద్యార్థులు 33,874 మంది, ద్వితీయ సంవత్సరం 38,174 మంది ఉన్నారు. ఆయా తేదీల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అన్ని సెంటర్లలో తాగునీటి సదుపాయం కల్పించాం.



ప్రశ్న : పరీక్షలకు సంబంధించి ఎలాంటి నిబంధనలున్నాయి?

ప్రారంభ సమయం కంటే ఒక్కనిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.

ప్రశ్న: పరీక్ష కేంద్రాల వద్ద ఇబ్బందుల పరిష్కారానికి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

ఇంటర్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు తెలియజేయడానికి ఏలూరులోని ఆర్ఐఒ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు 08812-230197 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయొచ్చు. లేదా కంట్రోల్ రూము ఇన్‌ఛార్జి జి.రత్నకిషోర్ 7032241842 నంబరుకు ఫోన్ చేసైనా సమస్యలను తెలపొచ్చు. పరీక్షలు పటిష్ఠంగా నిర్వహించడానికి ఆరు ఫ్లయింగ్, 12 సిట్టింగ్ స్క్వాడ్లను నియమించారు. వీటితోపాటు హైపవర్ కమిటీ (హెచ్‌పిసి), జిల్లా పరీక్షల కమిటీ (డిపిసి) సభ్యులు, డివిఇఒలు, రెవెన్యూ అధికారులు ఆయా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. మొత్తం 106 మంది ముఖ్య పర్యవేక్షకులు, 106 మంది విభాగాధికారులను నియమించారు.

ప్రశ్న : ప్రశ్న పత్రాలు జిల్లాకు చేరాయా?

ప్రశ్నా పత్రాలు ఇప్పటికే జిల్లాకు చేరాయి. వీటిని పోలీసుబందోబస్తు మధ్య భద్రపరిచారు. మొత్తం 30 స్టోరేజ్ పాయింట్లకు వీటిని తరలించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

ప్రశ్న: 144 సెక్షన్ ఎక్కడెక్కడ అమలు చేస్తున్నారు?

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఆయా కేంద్రాలకు సమీపంలోని ఫొటోస్టాట్ దుకాణాలు, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. హాల్‌టికెట్ ఇవ్వకుండా ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తుంటే కంట్రోల్ రూముకు సమాచారం ఇవ్వాలి.

ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలి : సిపిఎం



ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలందరికీ ఉచిత వైద్యాన్ని ప్రభుత్వాల అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక 29వ డివిజన్ కుమ్మరిరేవులో సిపిఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభించిన రవి మాట్లాడుతూ వైద్యం అనేది నేడు పేద ప్రజలకు ఖరీదైపోయిందన్నారు. వైద్యరంగంలో కార్పొరేట్ ఆసుపత్రులు ప్రవేశించడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రనిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. మనదేశంలో వైద్య విద్యను అభ్యసించాలంటే విద్యార్థులు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు. దాని ప్రభావం వారు డాక్టర్లు అయిన తర్వాత పేదలకు వైద్యం అందించే దానిమీద ఉంటుందన్నారు. వైద్యరంగంలో ప్రపంచంలో క్యూబా ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. అక్కడ వైద్య విద్యను ఉచితంగా అందిస్తున్నారన్నారు. మనదేశంలో కేరళలోని వామపక్ష ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. కాబట్టి మనదేశంలో వైద్యవిద్యలో అలాంటి మార్పులు తీసుకొస్తే పేదలకు ఉచిత వైద్యం అందించడం వీలవుతుందని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులు నియమించకపోవడం, అన్ని రకాల పరీక్షలు నిర్వహించకపోవడం, ప్రజలకు అందుబాటులో ఏరియా ప్రభుత్వాసుపత్రులు లేకపోవడంతో ప్రజలు ప్రయివేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు బి.సోమయ్య మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం కుమ్మరిరేవులో సిపిఎం ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందని గుర్తుచేశారు. సిపిఎం పేదల సమస్యలపై నిరంతర పోరాటాలు కార్యక్రమాలు చేస్తూనే, ప్రజలకు ఉచిత మెడికల్ శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో మూడున్నర లక్షల జనాభా ఉందని, జనాభాకు అనుగుణంగా కనీసం ఏరియా ఆసుపత్రి కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో 40 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, 350 బెడ్స్ రద్దు కావడంతో పేద ప్రజలకు వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు నగరంలో ఏరియా ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ ఈడుపుగంటి ఠాగూర్ ప్రసాద్, డాక్టర్ జిసివి.రాధాకృష్ణ, డాక్టర్ ప్రసాద్‌నాయక్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎపి మెడికల్ రిప్రజెంటేటీవ్, ప్రజా ఆరోగ్య వేదిక కార్యకర్తలు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు బి.జగన్నాధరావు, కే.రామాంజనేయులు, వివిఎన్.ప్రసాద్, స్థానిక కమిటీ సభ్యులు చిట్టా కళావతి, ఎస్.రాణి, ఎం.త్రిమూర్తులమ్మ, పార్వతి, సీతమ్మ ఏసుబాబు, మీసాల సత్యనారాయణ, పూర్ణ, శంకర్‌రావు, దుర్గాంబ, హేమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎ.రవి

పోలింగ్‌కు సర్వం సన్నద్ధం

144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం స్థానిక పోలింగ్ కేంద్రం ఎంపిడిఒ కార్యాలయం వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎంఎల్‌సి పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల పరిధిలోని పది మండలాల ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలోని 29 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎంఎల్‌ఎలు, ఒక ఎంపీతో మొత్తం 184 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలోని 15 మంది ఎంపిటిసి సభ్యులు, ద్వారకాతిరుమల మండలం నుంచి 19 మంది, జంగారెడ్డిగూడెం మండలం నుంచి 18 మంది, జీలుగుమిల్లి నుంచి తొమ్మిది మంది, కామవరపుకోట నుంచి 17 మంది, కొయ్యలగూడెం నుంచి 19 మంది, కుక్కునూరు నుంచి పది మంది, పోలవరం నుంచి 13 మంది, టి.నరసాపురం నుంచి 16 మంది, వేలేరుపాడు నుంచి ఏడుగురు ఎంపిటిసిలతో పాటు జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ నుంచి 29 మంది కౌన్సిలర్లు, పది మంది జెడ్‌పిటిసి సభ్యులు, పోలవరం ఎంఎల్‌ఎ, చింతలపూడి ఎంఎల్‌ఎ, ఏలూరు ఎంపీ మొత్తం 184 మంది ప్రజాప్రతినిధులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను ఆదివారం జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి పరిశీలించారు. తహశీల్దార్ స్లీవజోజి ఆమెతో పాటు పాల్గొన్నారు.


పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇన్‌ఛార్జి డిఎస్‌పి కెవి.సత్యనారాయణ

ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఇన్‌ఛార్జి డిఎస్‌పి కెవి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిఐ బాలసురేష్‌బాబు, ఎస్‌ఐ సాగర్‌బాబు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి పోలీస్ సిబ్బందికి భద్రతా సూచనలు చేశారు. 169 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి సత్యనారాయణ తెలిపారు. ఇద్దరు డిఎస్‌పిలు, ముగ్గురు సిఐలు, 16 మంది ఎస్‌ఐలు, 13 మంది ఎఎస్‌ఐలు, 69 మంది పిసిలతో మొత్తం 169 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు బారికేడ్లను ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించినట్లు డిఎస్‌పి తెలిపారు.

నేడు సచివాలయాలు, ఆర్‌బికెలు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని కోర్లగుంట, ముసునూరు, కాట్రేనిపాడు, గోపవరం, బలివే, వలసపల్లి, చెక్కపల్లి, లోపూడి గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను ఈ నెల 13వ తేదీ సోమవారం ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభిస్తారని తెలిపారు.


వైద్య శిబిరం ప్రారంభించి మాట్లాడుతున్న డిఎస్‌పి లతాకుమారి

ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - పోలవరం

ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని డిఎస్‌పి కె.లతాకుమారి అన్నారు. మండలంలోని బంగారంపేట గ్రామంలో శ్రీరామ శక్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌతమి అతిథి గృహంలో గౌతమి నేత్రాలయ ట్రస్టు ద్వారా నిర్వహించిన వైద్య శిబిరాన్ని పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఈ మారుమూల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. దొరమామిడి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తే గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గౌతమి నేత్రాలయ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సతీష్ ప్రసాద్ డిఎస్‌పి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి త్వరలో దొరమామిడి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ శిబిరంలో 150 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామని, అందులో 36 మందికి ఆపరేషన్ అవకాశం ఉండగా త్వరలో వారిని రాజమండ్రి గౌతమి నేత్రాలయ వైద్యశాలకు తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. 65 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శ్రీరామశక్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పప్పల శ్రీనివాసరావు, సభ్యులు రమణ, మురళి, వెంకటేశ్వరరావు నిర్వహించారు.

ముమ్మరంగా వేరుశనగ తీతలు

చేతికి వచ్చిన పంట

ఆశాజనకంగా దిగుబడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో వేరుశనగపైరు తీతలు ప్రారంభమయ్యాయి. మండలంలో సార్వా వరి సాగు పూర్తయ్యక దాళ్వా వరిసాగు రద్దు కావడంతో మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు వేరుశనగ సాగు చేపట్టారు. మండలంలో గరువు భూమి(ఇసుక భూమి) గ్రామాలైన గోకినంపాడు, కొరగుంటపాలెం, బొమ్మినంపాడు, ఈడేపల్లి, పెదగొన్నూరు, అల్లూరు తదితర గ్రామాల్లో రైతులు వేరేశనగ సాగు చేస్తున్నారు. పంట చేతికి రావడంతో వేరుశనగ తీతలు గత పది రోజులుగా ఆయా గ్రామాల్లో ముమ్మురంగా జరుగుతున్నాయి. రైతులు కూలీలతో తీతలు తీయిస్తున్నారు. కూలీలు వేరుశనగ పైరు లాగి చేలో పనలుగా వేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పని చేసే మహిళా కూలీకి రూ.300, పురుషులకు రూ.500, రెండు పూటలు పని చేసే మహిళలకు రూ.500 కూలీగా చెల్లిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలు వేరుశనగా తీతలు తీసే కూలీలతో సందడిగా మారాయి. వేరుశనగ పైరు తీతలు బట్టి చూస్తే పంట ఆశజనకంగా ఉందని, దిగుబడులు వచ్చే ఆవకాశం ఉందని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కన్నా ఈసారి పంటను చూస్తుంటే పెట్టుబడులు పోను లాభాలు వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. దీనికి తోడు వేరుశనగకు మార్కెట్‌లో ధర కూడా బాగానే ఉందంటున్నారు. గతేడాది కన్నా దిగుబడులు ఎక్కువగా వచ్చే అశకాశం ఉందని పలువురు రైతులు అంటున్నారు.


వేరుశనగ తీత తీస్తున్న కూలీలు

17న కలెక్టరేట్ వద్ద ధర్నా

జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 17వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు ఆర్.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు సిబ్బందికి హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్సులు అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఒ నెంబర్ ఏడు ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ సిబ్బందికి పెండింగ్ డిఎలు, సరెండర్ లీవ్ వేతనాలు ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నాలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, పర్మినెంట్ కార్మికులు, క్లాప్ ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని, సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా పర్మినెంట్ చేయడం లేదని, సిపిఎస్ రద్దు చేయలేదని వారు విమర్శించారు. ఈనెల 14 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మిట్ చేసేందుకు, సిపిఎస్ రద్దు కోసం నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యల ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 17వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద మున్సి పల్ కార్మికుల ధర్నాలు నిర్వహిస్తున్నారని వారు తెలి పారు. మున్సిపల్ పర్మినెంట్ సిబ్బందికి ఏడు పెండింగ్ డిఎలు ఇవ్వాలని, సరెండర్ లీవుల వేతనాలు చెల్లిం చాలని, జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని, సిపిఎస్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని వారు కోరారు. ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్‌లు అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని, ఆదివారం సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నట్లు వారు తెలిపారు. కలెక్టరేట్ వద్ద ధర్నాలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు చెందిన పర్మినెంట్ సిబ్బంది, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది, క్లాప్ ఆటో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న రోషన్‌కుమార్

ప్రజాశక్తి - లింగపాలెం

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాసగాని రామలక్ష్మి పక్షవాతంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నేత సొంగా రోషన్‌కుమార్ బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.ఐదు వేల నగదు అందించారు. ఆపన్నులకు అండగా నిలిచిన రోషన్‌కుమార్‌కి బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాఖమూడి శ్రీను, అబ్బూరి శివరామయ్య, కాకర్ల వెంకటేశ్వరరావు, కాకర్ల హేమసుందర్, కొల్లి వెంకటేశ్వరరావు, కత్తి నాగేశ్వరరావు, లక్కపాము సువర్ణరాజు, కొల్లి శ్రీను, రవితేజ పాల్గొన్నారు.

రామాంజనేయులుకు నివాళి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన వ్యక్తి కడియాల రామాంజనేయులు అని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. మండల పరిధిలోని శోభనాపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కడియాల రామాంజనేయులు ఇటీవల కాలంలో మృతి చెందారు. శోభనాపురం గ్రామంలో రామాంజనేయులు చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, మాజీ అధ్యక్షులు నరహరశెట్టి నరసింహరావు, ధనేకుల మురళీమోహనరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిడి.రవికుమార్, ఎన్.వేణు, సిహెచ్.రాజు, ఎం.నాగయ్య, వై.ఆంజనేయులు పాల్గొన్నారు.

14 జనసేన ఆవిర్భావ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చాట్రాయి

జనసేన పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఈ నెల 14వ తేదీన మచిలీపట్నంలో నిర్వహించే సభకు వేలాదిమంది కార్యకర్తలు తరలి రావాలని ప్రధాన రహదారిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కర్నూలు జిల్లా అధ్యక్షులు చింతా సురేష్ మాట్లాడుతూ అవినీతి పాలనను అంతమొందించుటకు ఏర్పడిన పార్టీ జనసేన పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరీదు శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, ఉపాధ్యక్షులు తుమ్మల జగన్, పాపారావు, కార్యదర్శులు సురేష్, ఆకాష్, రామకృష్ణ, చౌటుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - పోలవరం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి పిఎంఎవై గృహాలు మంజూరు చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. మండలంలోని పేట్రాలలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితుడు తోకల లక్ష్మణరావును శనివారం ఆయన కలిసి పరామర్శించారు. తక్షణ సహాయంగా బియ్యం, కూరగాయలు, దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా నాగరాజు అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి, మండల అధ్యక్షులు కామిశెట్టి నాగరాజు, ప్రధాన కార్యదర్శి చిలకా రాంబాబు, ఉపాధ్యక్షులు వేదవతి గణేష్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నగదు చోరీ?
విచారణ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రమణక్కపేట సమీపంలో శనివారం అర్ధరాత్రి గుమ్మస్తాల వద్ద నుంచి నగదు మాయమైన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడేనికి చెందిన విజయగణపతి ట్రేడర్స్‌కు చెందిన శివశంకర్ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో భాగంగా సరుకు వేసిన వ్యాపారుల వద్ద నుంచి డబ్బు వసూళ్లకు ఇద్దరు గుమ్మస్తాలు దుర్గారావు, రాజశేఖర్ పంపగా వారు వ్యాపారుల వద్ద నుంచి సుమారు రూ.1.70 లక్షలు బాకీలు వసూలు చేసుకుని మోటార్‌సైకిల్‌పై జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. మండలంలోని రమణక్కపేట సమీపంలోకి రాగానే గుర్తు తెలీని వ్యక్తులు వచ్చి బెదిరించి నగదు లాక్కొని పరారైనట్లు ఇద్దరు గుమ్మస్తాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారి యజమానికి విషయాన్నీ చేరవేయడంతో అతను అప్రమత్తమై అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి పోలీసులకు సమాచారం అందించారు. కారులో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారికి ఈ చోరీకి సంబంధం లేదని తెలుసుకుని పంపించేశారు. దీనికి సంబంధించి పోలీసులు ఉల్లిపాయల వ్యాపారం చేసే గుమ్మస్తాలను అదుపులోకి తీసుకున్నారు. గుమ్మస్తాలే ఈ పని చేశారా, లేక వేరే దారి దోపిడీ వంటిది ఏమైనా జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. దీనికి సంబధించి పూర్తి వివరాలు సేకరించిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.


ఇంట్లోకి దూసుకెళ్లిన కంటైనర్ లారీ

ఇంట్లోకి దూసుకెళ్లిన కంటైనర్

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని తడికలపూడి గ్రామంలో రహదారి పక్కన ఉన్న ఓ ఇంట్లోకి అదుపుతప్పి కంటైనర్ లారీ దూసుకెళ్లింది. ప్రహారీ గోడను ఢీకొట్టుకుంటూ లారీ ఇంట్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్‌కు గాయాలయ్యాయి. ప్రహారీ, ఇంటి గోడలు ధ్వంసం కావడంతో ఇంటి యజమానికి నష్టం వాటిల్లింది.

ట్రాక్టర్ ఢీకొని యువతి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ట్రాక్టర్ ఢీకొని యువతి మృతి చెందిన ఘటన మండలంలోని పట్టెన్నపాలెం గ్రామం వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన ముత్త భవ్యమణిదీపిక రెడ్డిగణపవరం తిరునాళ్ల కు వెళ్లింది. తిరిగి ద్విచక్రవాహనంపై వస్తుండగా పట్టెన్నపాలెం వద్ద ట్రాక్టర్ ఢీకొని మృతి చెందింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన భవ్య మణి దీపిక అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తండ్రి ఘంటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల కేంద్రమైన ఆగిరిపల్లి కొండకాలనీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తన సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1870 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

17 వరకూ ఇ-క్రాప్ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో అన్ని ఆర్‌బికె కేంద్రాల్లో ఇ-క్రాప్ ముసాయిదా జాబితా ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సామాజిక తనిఖీ నిమిత్తం ఏర్పాటు చేస్తున్నట్లు గణపవరం వ్యవసాయ అధికారి వై.ప్రసాద్ ఆదివారం తెలిపారు. దీనికి సంబంధించిన గ్రామసభలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు రైతు భరోసా కేంద్రం వద్ద ముసాయిదా జాబితాను పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరణల కోసం ఆర్‌బికెలో ఉన్న గ్రామ సహాయకులకు రాతపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు. ఈ క్రాప్ 2022-23 సీజన్ సవరణ ఆఖరి అవకాశమని చెప్పారు. తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎటువంటి మార్పులు చేర్పులు చేయబడవని తెలిపారు. రైతులంతా తమ గ్రామాల్లో ఉన్న ఆర్‌బికె సెంటర్లోకి వెళ్లి ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను 17వ తేదీ లోపు పరిశీలించుకోవాలని తెలిపారు.

'ఎస్‌సి వర్గీకరణ చేయాలి'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ కోసం పోరాడే ప్రతి సంఘాన్ని స్వాగతిస్తామని మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఇన్‌ఛార్జి అధ్యక్షులు కంబాల ప్రదీప్‌మాదిగ అన్నారు. ఎస్‌సి వర్గీకరణ కోసం పాదయాత్ర చేస్తున్న బృందానికి ఆయన ఆగిరిపల్లిలో స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన గిరిజన హక్కుల దండోరా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కలపాల సురేష్‌బాబు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వరరావు, రుద్రయ్య, కాంచనరావు పాల్గొన్నారు.


ఆలయంలో మాజీ మంత్రి బాపిరాజు దంపతులు

పెద్దింట్లమ్మ సన్నిధిలో మాజీ మంత్రి బాపిరాజు దంపతులు

ప్రజాశక్తి - కైకలూరు

మండలంలోని కొల్లేటికోటలో ఉన్న పెద్దింటి అమ్మవారిని ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఛైర్మన్, మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.వి. గోపాలరావు వారిని అతిథి మర్యాదలతో ఆహ్వానించి ఆలయ అర్చకులతో విశేష పూజలు జరిపించి, శేష వస్త్రాలతో పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ కుమారులు దూలం అదివినయ్, శ్యాము పాల్గొని భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.

బొల్లా వెంకన్నకు సత్కారం

ప్రజాశక్తి - కైకలూరు

టిడిపి విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి మాగంటి బాబు కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బొల్లా వెంకన్నను మండలంలోని ఆటపాక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాగంటి బాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ, పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ, ఏలూరి హరి, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు పడమట వాసు, రాష్ట్ర మాల మహాసేన కార్యదర్శి గడిదేశి విజయ్‌కుమార్, నంగెడ్ల సాయి పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - గణపవరం

వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం భువనపల్లి ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన కోసం పార్టీ ఉద్భవించిందన్నారు. గడచిన మూడున్నర సంవత్సర కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి వద్దకే వాలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎంపిపి దండువెంకటరామరాజు, గణపవరం సర్పంచి మూరా అలంకారం, నిడమర్రు జెడ్‌పిటిసి సభ్యులు కోడేకాశి, వైసిపి మండల కన్వీనర్లు దండు రాము, సంకు సత్యకుమార్, గణపవరం, నిడమర్రు మండలాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : వైసిపి 13వ ఆవిర్భావ దినోత్సవం ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ ఎలిజా కీర్తిశేషులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద వైసిపి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గడచిన మూడున్నర సంవత్సర కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్లు కంచర్ల వాసవిరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, జెడ్‌పిటిసి సభ్యులు పి.బాబ్జి, మూడు జిల్లాల శిశు సంక్షేమ శాఖ రీజనల్ ఛైర్మన్ వందనపు సాయి బాల పద్మ, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు, సొసైటీ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు, చిప్పాడ వెంకన్న, మండలాధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, కౌన్సిలర్లు నేకూరి కిషోర్, తడికిమల్ల మురళి, మేక రమాదేవి పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలో వైసిపి ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో వైసిపినే మళ్లీ అధికారంలోకి వస్తుందని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. ముసునూరులో మాజీ సర్పంచి రేగుల గోపాలకృష్ణ, కాట్రేనిపాడులో ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, కంభాల రాంబాబు, కంబాల దాసు, అక్కిరెడ్డిగూడెంలో ఎంపిటిసి సభ్యులు పుచ్చకాయల శ్రీనివాసరావు, లోపూడిలో సర్పంచి పేరం కృష్ణ, గుడిపాడులో రాజబోయిన శ్రీదేవి శ్రీనివాసరావు, వలసపల్లిలో చలసాని దామోదరరరావు, కోర్లగుంటలో మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణ, ఎంపిటిసి సుందరరావు ఆధ్వర్యంలో వైసివి ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

పెదపాడు : మండల కేంద్రమైన పెదపాడు గ్రామంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి, వైసిపి నాయకులు గంటా పద్మశ్రీ, అప్పనప్రసాద్, పెదపాడు సొసైటీ అధ్యక్షులు అక్కినేని రాజశేఖర్ పాల్గొన్నారు.

లింగపాలెం : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వైసిపి మండల అధ్యక్షులు మోహన్‌రావు ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి సభ్యులు వడ్లాని హరినాథరాజు ఇంటి వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పంచాయతీ ఎంపిటిసి సభ్యులు వడ్లని శ్రీలలిత, తోచలక పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ మధుబాబు పాల్గొన్నారు.

కైకలూరు : నియోజకవర్గ సంత మార్కెట్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనులపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన చేపడతామని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ అన్నారు. మండలంలోని బుసరాజుపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు 2020లో ఐటిడిఎ కోటరామచంద్రపురంవారు ఆర్‌ఒఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చారని, ఆ భూముల్లో గిరిజనులు శనివారం సాయంత్రం తుప్పలను తొలగిస్తుండగా జంగారెడ్డిగూడేనికి చెందిన సత్యనారాయణ, నాగవేణి, జంగారెడ్డిగూడెం రేంజర్ కడలి శ్రీవాణి గిరిజనులపై దాడి చేసి గాయపరిచారన్నారు. ఆ భూములపై గిరిజనులకు హక్కు లేదని దాడి చేశారన్నారు. ఈ దాడిలో రాములమ్మ, రత్తమ్మ గాయాలపాలయ్యారన్నారు. గిరిజనులకు ఇచ్చిన పట్టా భూముల్లో వ్యవసాయం చేయనివ్వకుండా రేంజర్ శ్రీవాణి బీట్ ఆఫీసర్లతో గిరిజనులపై దాడి చేయించారన్నారు. గిరిజన మహిళలపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఇసుక తరలిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - పోలవరం

ఇసుక డంపింగ్‌పై స్పష్టమైన ఆదేశాలు లేవని రెవెన్యూ అధికారులు అన్నారు. డిఎస్‌పి కె.లతాకుమారి పట్టిసీమ ఇసుక ర్యాంపు నిర్యాహకులను ఆదివారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టిసీమ ఇసుక ర్యాంపు గత నవంబర్ నెల నుంచి వాడుకలో లేదని, బల్లిపాడు ర్యాంపు నుంచి రవాణా అవుతుందని, పట్టిసీమ ఇసుక ర్యాంపు నుంచి రవాణా అవ్వడంలేదని పట్టిసీమ ఇసుక ర్యాంపు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కె.లతాకుమారి మాట్లాడుతూ ఇసుక డంపింగ్‌పై జెసి ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నా ఇసుక పంపిణీ కాంట్రాక్టర్లు ఇప్పటివరకూ సంబంధిత అనుమతి పత్రాలు చూపలేదని, ఇసుక డంపింగ్ తాత్కాలికంగా నిలిపివేశారని తెలిపారు. ఇసుక డంపింగ్ అనుమతి పత్రాల విషయంలో తగు సమాచారం ఇవ్వాలని రెవెన్యూ శాఖను కోరామని, తమకు ఇప్పటివరకూ ఈ విషయంపై రెవెన్యూ అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం రాలేదని డిఎస్‌పి తెలిపారు. ఈ విషయంపై రెవెన్యూ భూసేకరణ డిప్యూటీ తహశీల్దార్ కాజా రమేష్‌ని వివరణ కోరగా తహశీల్దార్ సెలవులో ఉన్నారని, సోమవారం ఈ విషయంపై స్పష్టమైన సమాచారం వస్తుందని తెలిపారు.

కన్వీనర్లు, గృహ సారథులతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు

పార్టీ అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీ పరంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థను ప్రవేశపెట్టారని ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. పూళ్లలో ఆదివారం దుద్దేపూడి, కోడూరుపాడు, కురెళ్లగూడెం గ్రామపంచాయతీ స్థాయిలో ఉన్న సచివాలయ కన్వీనర్లు గృహసారథులతో ఎంఎల్‌ఎ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజలతో మమేకమై కావాలని కోరారు. వారు ఇంటింటి సందర్శన చేపట్టాలని కోరారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందకుంటే అవి వారికి అందే విధంగా సహకరించాలని కోరారు. ప్రజలకు పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా అందుతున్న సేవలు గురించి వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాయం సుజాత ప్రసాద్, భీమడోలు ఎంపిపి కె.రామయ్య, భీమడోలు ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, పార్టీ మండల కన్వీనర్ రాయపాటి సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

దెందులూరు
ఎంఎంసి ఛైర్మన్‌గా అప్పనప్రసాద్

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా పెదపాడు మండలం అప్పనవీడు గ్రామానికి చెందిన వైసిపి నేత అప్పన ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్య చౌదరి ఆదివారం నిర్వహించిన వైసిపి 13వ ఆవిర్భావ వేడుకలో ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు ప్రసాద్‌ను అభినందించారు.

గంగానమ్మ సన్నిధిలో ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వేల్పుచర్ల శివారు అన్నవనేనివారిగూడెంలో నూతనంగా ప్రతిష్ఠించిన గంగానమ్మ తల్లి అమ్మవారిని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. ఆయనతో పాటు కుందేటి కస్తూరి, పటాపంచుల శ్రీనివాసరావు, కె.శివరామకృష్ణ, కె.నారాయణ, గంగాధరరావు ఉన్నారు.